# విద్యార్థి దశ చాలా కీలకం


విద్యార్థినులతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి పఠాన్ షియాజీ ఖాన్

నాతవరం: జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమైనదని, ఈ వయస్సులో ఇష్టపడి చదివితే అనుకున్న ఆశయం నేరవేరడం ఖాయమని నర్సీపట్నం సివిల్ జడ్జి పఠాన్ షియాజీ ఖాన్ అన్నారు. మండలంలోని మర్రిపాలెం కస్తూర్బా పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ప్రతి తరగతికి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. 7వ తరగతి విద్యార్థినులకు ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలకు స్వస్తి చెప్పాలని, అందరూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఇంటర్మీడియెట్ విద్యార్థినులకు వసతి సమస్య ఉందని పాఠశాల ప్రత్యేకాధికారి కె.భవాని...న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థినులకు నిర్వహించిన రక్త, వైద్య పరీక్షల వివరాల రికార్డులను జడ్జి పరిశీలించారు.

## సైన్స్ ప్రాక్టికల్స్ పరికరాల వితరణ


హెచ్ఎం దైవ ప్రసాద్ కు సైన్స్ మెటీరియల్ అందజేస్తున్న సత్యనారాయణ

నర్సీపట్నం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తురకబడి)కు ఏబీఎం విద్యా సంస్థల ప్రిన్సిపాల్ సత్యనారాయణ రూ. 6,500 విలువ చేసే సైన్స్ ప్రాక్టికల్స్ పరికరాలు, రసాయన పదార్థాలను వితరణగా అందజేశారు. వీటిని పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం దైవ ప్రసాద్, సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌కు అందజేశారు. ఉద్యోగ రీత్యా ముంబైలో స్థిరపడిన ఎం.వి.ఎస్.ఎస్.ఎన్.మూర్తి నాలుగు ఫ్యాన్‌లు అందజేయనున్నట్టు హెచ్ఎం తెలిపారు.

## తల్లి పేరిట మొక్కలు నాటాలి

నర్సీపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అమ్మ కోసం.. నాలుగు మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీవో నాని బాబు కోరారు. బుధవారం ఈ కార్యక్రమాన్ని చెట్టుపల్లిలో లాంఛనంగా ప్రారంభించారు. అమ్మ పేరు మీద కుమార్తెలచే మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళికి ప్రాణవాయునిచ్చే వనాలను అభివృద్ధి చేయాలన్నారు. తల్లి పేరు మీద ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు.

## కాగడాలతో నిరసన ప్రదర్శన


కాగడాలతో ప్రదర్శన చేస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు

చోడవరం: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడికి నిరసనగా మండలంలో వెంకన్నపాలెంలో సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు బుధవారం కాగడాలతో ప్రదర్శన చేశారు. వెంకన్నపాలెం మెయిన్‌రోడ్డుపై కాగడాలతో ప్రదర్శన చేసి, జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి రేజేటి రామాచారి మాట్లాడుతూ హిందువులపై దాడులు ఆపకపోతే తీవ్ర పరిణామం ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఆందోళనలో సమరత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు కూర్మదాసు మాలిబాబు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నేడు మాడుగులలో రక్తదాన శిబిరం

మాడుగుల: స్థానిక దేవీ ఆడిటోరియం వద్ద గురువారం భారత నిర్మాణ సేన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఆ ట్రస్టు సభ్యుడు గౌరీపట్టపు మహేష్ కుమార్ తెలిపారు.

# ‘బొత్స’కు అభినందనలు


బొత్స సత్యనారాయణకు అభినందనలు తెలుపుతున్న జెడ్పీటీసీ రాంబాబు,నాయకులు

బుచ్చెయ్యపేట: ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణను బుధవారం వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కలిసి అభినందించారు. బొత్స ఎన్నిక లాంఛనప్రాయం కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు, బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ దొండా రాంబాబు,జిల్లా అగ్రికల్చరల్ బోర్డు మెంబర్ గుడాల ఆనంద్,కేపీ ఆగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీను తదితరులు కలిసి అభినందించారు. ఉమ్మడి విశాఖ జిల్లా అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.





# ర్యాగింగ్‌కు పాల్పడితే కెరీర్ క్లోజ్

- విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు
- విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు

నర్సీపట్నం: సీనియర్ విద్యార్థులు జూనియర్లకు ఆదర్శంగా ఉండాలి, అంతేగాని ర్యాంగింగ్ తదితర కార్యకలాపాలతో వారిని భయభ్రాంతులకు గురిచేయడం తగదు. విద్యా సంస్థల్లో ర్యాంగింగ్ పేరుతో జరుగుతున్న వికృత చేష్టలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు ప్రభుత్వాలు, పోలీసు శాఖ, విద్యా సంస్థల యాజమాన్యాలు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాయి. ర్యాంగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, కేరీర్ క్లోజ్ అవుతుందని హెచ్చరిస్తూ పోలీసులు సదస్సులు నిర్వహిస్తున్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే ఏవిధమైన శిక్షలు ఉంటాయో విద్యార్థులకు వివరిస్తున్నారు. జూనియర్, సీనియర్ అనే బేధం లేకుండా అందరూ సోదరభావంతో మెలగాలని సూచిస్తున్నారు. జూనియర్ విద్యార్థులను సీనియర్లు దూషించడం, హింసించడం, వారితో చేయకూడని పనులు చేయించడం చట్టరీత్యా నేరమని చట్టాలు చెబుతున్నాయి. పోలీసుల ఆదేశాల మేరకు ర్యాగింగ్‌కు కళ్లెం వేసేందుకు విద్యాసంస్థల్లో అధ్యాపకులు, విద్యార్థులతో కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ చర్యలన్నీ సత్ఫలితాలు ఇస్తున్నాయి.

### భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు



ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు. ర్యాగింగ్ వల్ల విద్యార్థులు తెలియకుండానే ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ర్యాగింగ్‌లో పాలుపంచుకోవడం, ప్రోత్సహించడం వంటి చర్యలకు పాల్పడితే శిక్షలు కఠినంగా ఉంటాయి. ర్యాగింగ్ కట్టడకి విద్యాసంస్థలు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలి.

– సుధాకర్, ఎస్ఐ (నర్సీపట్నం టౌన్)

## ఎస్సీ వర్గీకరణపై పునరాలోచన చేయాలి

- కొత్తకోటలో కొవ్వొత్తులతో ప్రదర్శన

చోడవరం: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ రావికమతం మండలం కొత్తకోటలో దళిత సంఘాలు సభ్యులు బుధవారం కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం బాధాకరమంటూ అంబేడ్కర్ యువజనసేవాసంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన జరిపారు. వర్గీకరణ తీర్పుపై పునురాలోచించాలని వారు కోరారు.


కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న అంబేడ్కర్ యువజన సేవాసంఘం సభ్యులు